# కంచే చేను మేస్తే

రామం ఇంతదారుణంగా ప్రవర్తించాడంటే నమ్మలేకుండావున్నాను. వాడి తండ్రి సీతాపతి స్వయానా మా మేనమామ అయనే స్వయంగా వచ్చి "....ఇదిరా సంగతి. పదిమందిలోనూ తలెత్తుకోలేని స్థితికి మా బ్రతుకులు దిగజారేయి. రెండేళ్ళక్రితం నా సంతకంచేసి లక్షరూపాయలు ఫిక్సెడ్ డిపాజిట్ తీసుకుని ఆ డబ్బంతా తగలేశాడంటే నోరుమూసుకూరుకున్నాను. వాడు పనిచేస్తున్న బేంక్ లోనే నా డిపాజిట్లున్నాయి. పైవాడెవడో ఫోర్జరీచేసేడంటే కంప్లెయింట్ చెయ్యొచ్చు. కంచే చేనుమేస్తే ఏంచెయ్యను?...." అంటూ మొదలెట్టాడు.

నిజమేమరి, ఏడాదిక్రితం యస్.పి.గా ప్రొమోట్ చేసి యీ వూరు ట్రాన్స్‌ఫర్ చేసేరు నన్ను. అప్పటికే వీడు ఎవరో ఓ ఎయిర్ హోస్టెస్‌తో రొమాన్స్‌లోపడి ఓ వెలుగు వెలిగేసి ఆరిపోయేడన్న పుకారు మా బంధువర్గాలలో పరిమళంలాగ వ్యాపించింది. మా మావయ్యకి డబ్బుంది కాని, లోభి అన్న ప్రతీతి కూడా వుండటంతో తండ్రి డబ్బు మరీ మురిగిపోకుండా కొడుకు కాస్త గాలి తగలనిస్తున్నాడన్న శుభవార్త విని చాలా మంది హాయిగా ఊపిరిపిల్చుకున్నారు. అందుకే ఆ విషయం తెలిసీ తెలియనట్లుగా నేనుకుడా కెలకలేదు.

"ముందు జాగ్రత్తకోసం వెంటనే నా డిపాజిట్లన్నీ మరో బేంక్‌కి ట్రాన్స్‌ఫర్ చేసేను. ఏ గొడవలేకుండా ఏడాదై సద్దుమణిగిందనుకుంటే మళ్ళీ పిడుగులాగ ఈ ఫోర్జరీ కేసేమిట్రా? ఇన్నాళ్ళూ యిక్కడ తలెత్తుకోలేకుండా చేశాడు. మరి దీంతో ఈ దేశం విడిచిపోవాలో ఈ లోకమే విడిచిపోవాలో తెలియక నిద్రాహారాలుమాని బెంగెట్టుకుపోయామంటే నమ్మ...."

ముక్కూ-మొహం తెలియని ఓ అమ్మాయి తాలూకు ఏభై వేల ఫిక్సెడ్ డిపాజిట్ ఫోర్జరీ చేసి కాజేసేడుట. ఇవ్వాళ పొద్దునే పేపర్లో పడిన వార్తతో మా మావయ్య మరీ డీలా అయిపోయేడు. "ప్రేమాయణంలో కుంభకోణం" అనే శీర్షికతో ప్రచురించిన ఉదంతం ఏమిటంటే-మావాడు సరస్వతి అనే హైస్కూల్

టీచర్‌ని ఓ పథకం ప్రకారం ప్రేమించినట్టు నటించి ఆ అమ్మాయి తాలూకు యాభై వేల ఫిక్సెడ్ డిపాజిట్ రెన్యూవల్ చేయిస్తానని చెప్పి మూడు రోజులక్రితం ఆ అమ్మాయిచేత సంతకాలు పెట్టించి పంపించేసిన తర్వాత ఆ సొమ్ము తను తీసుకుని ఆ సాయంత్రమే వూరునించి వుడాయించి నిన్న ఉదయాన్ని బేంకు డ్యూటీలో తిరిగి చేరేడట. డిపాజిట్ రెన్యూవల్ సర్టిఫికెట్ ఇంటికి పట్టుకొచ్చి యిస్తానన్న మా రామం మొన్న తెచ్చి యివ్వకపోవడంతో నిన్న తనే స్వయంగా బేంక్ కొచ్చి వాణ్ణి కల్సుకుని అడిగిందట. రెండుమూడు రోజుల్లో యిస్తానని వాడు చెప్పడంతో అనుమానంవొచ్చి బేంక్ ఏజెంట్‌కి రిపోర్ట్ చెయ్యడానికి వెడుతుంటే ఆమె చెయ్యి పట్టుకుని వెళ్ళొద్దని బ్రతిమాలేడట. నలుగురు సహోద్యోగులు చూస్తూండగ చెయ్యివిదుల్చుకొని చరచరా ఏజెంట్‌రూంలోకి వెళ్ళిందిట. వాళ్ళిద్దరి ప్రేమాయణం తెలుసున్న ఆ ఏజెంట్ రెండు రోజుల్లో మా వాడు డిపాజిట్ చెయ్యకపోతే క్రిమినల్ కేసు పెట్టడం వీడి ఉద్యోగం పోవడం జరుగుతాయని బెదిరించేడట. మా విలేకరి ఏజెంట్‌ని కల్సుకున్నప్పుడు ఈ విషయంలో ప్రస్తావించడానికి నిరాకరించేడట. మా రామానికిది మొదటిసారికాదనీ రెండేళ్ళ క్రితం తండ్రి తాలూకు డిపాజిట్ కూడా దొంగసంతకంచేసి లక్షరూపాయిలు పైగా కేష్ తీసుకున్నాడనీ, చివరకి వాడి తండ్రే ఉద్యోగం పోతుందేమోనని చక్రం అడ్డం వేశాడని వాడి సహోద్యోగులు ఈ కుంభకోణం గురించి గుసగుసలాడుకుంటున్నారుట. పూర్తిపేర్లుతో సహా పేపర్లో పడ్డ ఈ వార్త చదివిన కొందరు స్నేహితులు మా మావయ్యకి ఫోన్‌చేసి చెప్పేక పొద్దున్నే నా దగ్గరకి పరిగెత్తుకొచ్చేడు. మా మావయ్యకి ఏకైక సంతానం ఈ రామం. చదువు సంస్కారం, మంచి వుద్యోగం వున్నాయి. ఆస్తిపాస్తులకి లోటులేదు. అలాంటి వాడిలా తయారయ్యేడంటే మా మావయ్య పెంపకంలోనే ఎక్కడో లోపం వుండి వుండాలి.

''అసలు ఈ గొడవంతా నీకెప్పుడు తెలిసింది?'' అడిగేను.

''నిన్న సాయింత్రం మాయింటికి నాలుగిళ్ళవతల పాండురంగారావని, ఎడ్వొకేట్ వున్నాడు. అతని కోడలు, నీరజ కూడా ఆ బేంకులోనే పన్చేస్తోంది. అమ్మాయి రహస్యంగా మా ఆవిడకి చెప్పింది.''

''రామం ఏమంటాడు?''

''ఆ అమ్మాయికి చెప్పి డబ్బు తీసుకున్నాను. నాలుగురోజుల్లో నాకు బేంక్ లోను వొస్తుంది. అది రాగానే తీర్చేస్తాను అని చెప్పేడట. ఆ అమ్మాయి సరే అందిట. పేపర్లో పడిందంతా కట్టుకథ అన్నాడు. మరి ఇందులో నిజమెంతో అబద్ధమెంతో తెలియటంలేదు. నీకేమంత కర్మం వొచ్చిందిరా? డబ్బవసరమైతే నేను యిస్తానుకదా! అంటే మాట్లాడడు. చివరకి ఈ రోజు పొద్దున్న పేపరు కూడా చదివేక నేనూ మీ అత్తయ్యా జంటగా కంటతడిపెట్టి ఆ యాభై వేలూ మనం కట్టేద్దాం అసలీ డబ్బు ఏంజేసేవో చెప్పు అని అడిగితే ''దాన్ని గురించి ఇప్పుడు నన్నేమీ అడగొద్దు. ఇంకమీదట యిలాంటి డబ్బవసరంరాదు, నామాట నమ్మండి'' అన్నాడు.

ఆ ఎయిర్‌హోస్టెసమ్మాయి వీణ్ణేమయినా బ్లాక్‌మెయిల్ చేస్తోందేమో! ఉండు అది ముందర ఎంక్వయిరీ చేస్తాను.''

''నువ్వూ పోలీసాఫీసర్‌వి. నువ్వు తీగలాగేవంటే డొంకంతా మళ్ళీ కదుల్తుంది. అభయంతోనే యిన్నాళ్ళూ నీకు చెప్పలేదు అదేమీ వొద్దుకాని నువ్వో పని చెయ్యి. ఆ బేంకులో రేపు డబ్బు కట్టేస్తాను, నువ్వివ్వాళ వెళ్ళి మళ్ళీ కేసూ గీసూ అనడమో హెడ్డాఫీస్‌కి రాయడమో జరక్కుండా చూడు. ముందు ఆ ఉపకారం చెయ్యి. నేనిప్పటికే సిగ్గుతో సగం చచ్చున్నాను, ఇన్నాళ్ళు ఎంతో గర్వంగా బతిగేను.... ఇంక దీంతో....'' అంటూ గద్గద స్వరంతో వాక్యం పూర్తిచెయ్యలేక కండవాతో మొహం కప్పుకున్నాడు.

"ఛ! అదేమిటి మావయ్యా! పెద్దవాడివి. అన్నీ తెలుసున్నవాడివి నువ్వలా బెంబేలు పడిపోతే ఎలాగ! సమస్యలొచ్చినప్పుడు పరిష్కరించుకుంటాం. ఒకడే కొడుకవటంవల్ల నువ్వూ అత్తయ్య గారాబంగా పెంచేరు. వాడు అలుసు తీసుకుని తప్పుదారిపట్టేడు. స్వతహాగా తెలివైనవాడు, బుద్ధిమంతుడు, ప్రయోజకుడనిపించుకున్నాడు. ఏ సహవాసదోషంవల్లో తప్పుచేసేడు. ఇంక యిలాంటి గొడవలు రాకుండా వుండాలంటే వాడికి నచ్చిన పిల్లనిచ్చి పెళ్ళి చేసెయ్యాలి. ఇప్పటికే ఆలస్యం చేశావు.''

''ఆలస్యం నేను చెయ్యలేదురా! అదివాడి స్వయంకృతాపరాధం. మా ప్రారబ్ధం. ఈ రెండేళ్ళలోనూ లక్షలు లక్షలు యిస్తామంటూ బ్రహ్మాండమైన సంబంధాలొచ్చేయి, ఏంలాభం! పెళ్ళిచూపులుకైనా మమ్మల్ని పిలవకముందే, ఎలా తెలుసుకున్నారో పేడిచర్త్ర తెలుసుకుని మొహం చాటేసినారు.''

"అదే నీతో వొచ్చిన పేచీ. కాలంతోబాటు నువ్వు మారాలి, వాడి అభిప్రాయం, అభిరుచి, ఆశయాలు సంగతి ఆలోచించకుండా కట్నాలు కానుకలు అంటూ'' ఒక్కచురకేసెను.

''నేనేమీ అడగలేదురా బాబూ! వాళ్ళు బోలెడు ఆస్తిపాస్తులున్నవాళ్ళు. వాళ్ళంతకివాళ్ళే యిస్తామంటూ వొచ్చేరు. మొన్నటివరకూ వాడికున్న పేరు ప్రతిష్ఠలతో సంప్రదింపులు వరకూ రాకుండానే బెడిసికొట్టేయి.''

''ఎయిర్‌హోస్టెస్ అంటే సామాన్యమైన ఉద్యోగం కాదు. చదువు సంస్కారం రూపం తెలివితేటలు వుంటేకాని సెలక్ట్ అవ్వరు. వాడిష్టపడితే ఆ అమ్మాయినే పెళ్ళి చేసుకోమనవల్సింది.''

''చేసుకోమందునో వొద్దందునో కనీసం నాకా అమ్మాయిని గురించి చెప్పేడా? నాకేం తెలుసు? ఆ పిల్లని గురించి తెలుసా? డిపాజిట్ తీసి తగలెయ్యడం గురించి తెలుసా? వీడి ఫ్రెండ్సూ, రేసెసూ, పార్టీలు, తిరుగుళ్ళు గురించి తెలుసా? నాకు తెలిసేటప్పటికి అది వీడి నెత్తిన చెయ్యిపెట్టి, ట్రాన్స్‌ఫర్ మీద భువనేశ్వర్ పోయింది.''

"మరి నీకీ విషయాలన్నీ ఎలాతెలిసేయి?" అడిగేను. తెలియక కాదు- ఇందాకా చెప్పేడు. మా మావయ్య నోటినుంచి మళ్ళీ వినాలని సరదా. రామం ధర్మమా అని మా మావయ్య అహంకారం అధఃపాతాళానికి దిగిపోయింది.

"చెప్పేను కాదుట్రా! డిపాజిట్ రెన్యూ చేయిద్దామనుకుంటే ఇంట్లో సర్టిఫికెట్ కనబడలేదు. అయిదువేలా పదివేలా? లక్షరూపాయిలు! రామం వూళ్ళో లేడు. బేంక్‌వెళ్ళి వాకబుచేస్తే ఆరునెలల క్రితమే త్రీ పెర్సంట్ డిస్కౌంట్ మీద నా సంతకం ఫోర్జరీ చేసి ఎవరో తీసేసుకున్నట్టుంది. ఏజెంట్‌కి కంప్లెయింట్ చేశాను. రెండు రోజులు బేంక్‌లో గందరగోళం జరిగింతర్వాత మావాడు తిరిగి రావడంతో సిగ్గేసి తల దించుకుని ఏజెంట్‌కి క్షమాపణ చెప్పుకున్నాను"

"ఆ ఎయిర్ హోస్టెస్ పేరేమిటన్నావు?''

"కాంతిపట్నాయకట. మన కులం కాదు, మన భాష కాదు, మన సంప్రదాయం కాదు, మన రాష్ట్రం కాదు, ఇంకా గొడవలన్నీ మళ్ళీ కెలక్కు. ఆ గొడవంతా సద్దుమణిగింది కదా - మళ్ళీ ఏమైనా సంబంధాలొస్తాయేమోనని ఆశ పడ్డాను. ఇప్పుడు వీణ్ణి గురించి పేపర్లో కూడా వేశారేమో, ఇంకా వీడికి పెళ్ళవు

తుందన్న ఆశకూడా లేదు. ఇదంతా మా తలరాత!" అంటూ నుదుటిమీద చేతి వేళ్ళతో చరుచుకున్నాడు.

* * *

బేంక్ ఏజెంట్ కల్యాణరావు మంచి వ్యవహారవేత్త. మాటకారిలాగ కన బడ్డాడు. నన్ను నేను పరిచయం చేసుకోగానే అయిదు నిమిషాల్లో విజిటర్స్ అందరినీ పంపించేసి, అటెండర్‌తో రెండు కూల్‌డ్రింక్స్ తెమ్మని, ఇంకెవ్వరినీ లోపలికి రానివ్వద్దనీ చెప్పి పంపేశాడు. నేనొచ్చిన పని చెప్పేను.

"నో ప్రాబ్లమ్. పత్రికల్లో పడ్డవార్త చదివి హెడ్డాఫీసువాళ్ళు కంగారు పడుతూ ఫోన్ చేశారు. అదంతా అబద్ధం, ఆ అమ్మాయే డబ్బు తీసుకుంది, రెండు రోజుల్లో మళ్ళీ ఫ్రెష్ డిపాజిట్ తీసుకుంటానంది అని సర్ది చెప్పేను. రేపుఎల్లుండిలోగా డబ్బు కట్టేస్తే సరిపోతుంది" అన్నాడాయన. దాన్నిగురించి ఏదో రాద్ధాంతం చేస్తాడనుకున్నా. చాలా కూల్‌గా తీసుకున్నాడు.

"అసలు ఆ అమ్మాయెవరు? ఏం జరిగింది? ఆ ఫిక్స్‌డ్ డిపాజిట్ తాలూకు ఫైలు చూడనిస్తారా!" అని అడిగేను బిజినెస్ లైన్‌గా.

"ఆ అమ్మాయిని నేను బాగా ఎరుగుదును. జెమ్ ఆఫ్ ఎ గర్ల్. ఆమె మా కష్టమర్. రామచంద్రమూర్తి కేవలం యిక్కడ బేంక్‌లో ఆఫీసరే కాదు, నాకు చాలా సన్నిహితుడు. ఇద్దరి క్షేమాన్ని దృష్టిలో వుంచుకుని వ్యవహరించి ఆ ఫైలు ఎక్కడ వుంచాలో అక్కడ వుంచాను. మీకు కావల్సింది మీ రామం క్షేమం. మీ రడిగిన వివరాలన్నీ మీ రామం దగ్గిర్నుంచే తెలుసుకోవచ్చుగా? ఆ ఫైలు గురించి మీ రెందుకు మరిచి పోకూడదూ?" అన్నాడు నవ్వుతూ.

"అయ్ అప్రిషియేట్ యువర్ స్టేండ్. ఫైలు సంగతి మరిచిపోదాం, మరి వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారన్న వార్త...."

''అందులో కొంత నిజం వుంది. రామచంద్రమూర్తి ఆ అమ్మాయిని ప్రేమించేడు.''

''అంటే-సరస్వతి రాఘూన్ని ప్రేమించలేదంటారా?''

''తండ్రిలేని పిల్ల. రెక్కల కష్టం మీద తల్లి పెంచింది. తల్లికి కూతురు, కూతురికి తల్లి తప్ప ఎవరూ లేరు. తను పెళ్ళి చేసుకుంటే తల్లి జీవితానికి

ఆధారం, మార్గం, గమ్యం ఏమిటా అని నిర్ణయించుకుని దానికి అనుకూలంగా వున్నవాడు దొరికితే పెళ్ళి చేసుకుని ఆ తర్వాత తీరుబడిగా ప్రేమించుకోవాలని సరస్వతి అభిప్రాయం. అందుచేత ఇటు తన తల్లి అటు రామం తల్లిదండ్రులు అంగీకరిస్తే ముందు పెళ్ళి తర్వాత ప్రేమ అంది. మరి రామం తన తల్లిదండ్రులతో సంప్రదించినట్లులేదు."

''ఆ అమ్మాయికింత ప్రపంచ జ్ఞానం వుందంటే....''

''యమ్మే బి యిడి.....''

"చదువుకి ప్రేమావేశాలకి సంబంధం లేదు మా రామానికి చదువు తక్కువా? బేంక్‌లో డైరెక్ట్ రిక్రూట్‌గా ఆఫీసరయ్యాడు. కాని, వాడికి ప్రపంచ జ్ఞానమేవుంటే ఆ ఎయిర్ హోస్టెస్‌తో రొమేన్స్ ఈ ఫోర్జరీకేసులు...."

"ప్రపంచ జ్ఞానం లేకకాదు పరిస్థితుల ప్రభావం. రామచంద్రమూర్తి మంచితనంలో నాకు సంపూర్ణమైన విశ్వాసం వుంది. లేకపోతే వీళ్ళ విషయంలో కలుగజేసుకునేవాణ్ణికాదు."

"ఒక విషయం చెప్పండి. ఆ ఎయిర్ హోస్టెస్‌తో ఎఫెయిర్, ఈ డబ్బంతా ఏం చేసేడో వివరాలు మీకు తెలుసా?"

"తెలుసు. ఇప్పుడు మీరు అడక్కండి. సమయం వొచ్చినప్పుడు చెబుతాను".

"ఆల్ రైట్. నేను సరస్వతి నొకసారి కలుసుకోవడానికి ఎప్పుడు వీలవుతుంది?''

"వస్తానంటే ఇప్పుడు తీసుకెడతాను. యమ్ ఫిల్ పరీక్షల కెడుతుంది. శలవుపెట్టి ఇంట్లోనే చదువుకుంటూ వుంటుంది."

"మీరు శ్రమనుకోకపోతే...."

"శ్రమేమీ లేదు. మా యింటికే వెడుతున్నాం. తల్లికూతుళ్ళు మా యింట్లోనే చిన్న పోర్షన్‌లో అద్దెకుంటున్నారు" అంటూ లేచాడాయన.

నా కార్లోనే బయల్దేరి వెళ్ళాం. త్రోవలో కళ్యాణరావు చెప్పేడు- సరస్వతి బియ్యే చదువుతుండగా, ప్రయివేట్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్న తండ్రి

పీథయ్యో యేట పోయేడట. తల్లి వాళ్ళున్న కాలనీ మహిళామండలి సహాయంతో అప్పడాలు, ఒడియాలు, ఊరగాయలు, చేగోడీలు, జంతికలు లాంటివి యింట్లోనే తయారుచేసి అమ్ముతూ గుట్టుగా సంసారం గడుపుతూ సరస్వతిని చదివించింది. భర్తపోయింతర్వాత ఉన్న నగానట్రా అమ్మేసింది. తల్లిపేర ఇప్పుడో లక్షరూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ వుందిట. అయిదారేళ్ళలోనూ తల్లిచ్చిందయితే ఏమిటి, తన సంపాదనయితే ఏమిటి యాభై అరవై వేలు దాకా సరస్వతి పేర బేంక్‌లో వుందిట.

సరస్వతి లక్షణంగా వుంది. చదువూ సంస్కారంతో బాటు రూపం వినయంకూడా వున్నాయి. తల్లికూడా బ్రతికి చెడ్డమనిషేమో మర్యాద హుందాతనం వున్నాయి. బేంక్‌లో కళ్యాణరావుని దింపేసి రామం సీటుదగ్గరికెళ్ళి కూర్చుని నేను చక్కబెట్టిన రాచకార్యాన్ని వివరించేను మా మావయ్యని ఒప్పించి తనకి సరస్వతికి పెళ్ళి జరిపించమన్నాడు. సాయంత్రం వాళ్ళింటికొచ్చి మాట్లాడతానని చెప్పేను. అక్కడ నీరజనే అమ్మాయి వుందని మా మావయ్య మాటలు గుర్తుకొచ్చి ఆ అమ్మాయిని కల్సుకుని మావాడి చరిత్ర గురించి దర్యాప్తు చేద్దామనుకున్నాను కాని మళ్ళీ నా పోలీసుబుద్ధిని అదుపులో పెట్టుకుని ముందీ శుభకార్యం సంగతి ఆలోచించాలనుకున్నాను.

ఆ సాయంత్రమే మా అత్తయ్యని మావయ్యనీ తీసుకెళ్ళి సరస్వతినీ తల్లినీ పరిచయం చేశాను.

''కామేశం! నాకీసంబంధం అన్నివిధాలా నచ్చింది. అమ్మాయి లక్షణంగా వుంది ఆవిడకూడా నెమ్మదస్తురాలు. ఆవిడకి మాత్రం ఎవరున్నారు? మనతోటే వుండమని బ్రతిమాల్తాను నాకూ సాయంగా వుంటుంది. ఇద్దరికీ ఉద్యోగలాయె మరి. అలా అని ఆమె గౌరవానికేవిధంగానూ లోటు రానివ్వను'' అంది మా అత్తయ్య, ఇంటికి తిరిగొచ్చేక.

''వాడికున్న కీర్తి ప్రతిష్ఠల దృష్ట్యా ఈ మాత్రం సంబంధం రావడం కూడా అదృష్టమే అనుకోవాలి. అమ్మాయి కూడా సంపాదించుకుంటుంది. మీ అత్తయ్య చెప్పినట్టు ఆవిడ మనింట్లోనే వుంటే ఆవిడకీ ఖర్చుండదు, మనకీ సాయంగా వుంటుంది. పోనీ, ఆ వడ్డీ డబ్బు ఖర్చుపెట్టుకున్నా ఆవిడ తదనంతరం ఆ అమ్మాయికే యిస్తుంది.''

నీ తదనంతరం తర్వాతే కదా ఆవిడ తదనంతరం అందామనిపించింది, దిక్కుమాలిన లెక్కలూ ఆయనాను!

''కంగ్రాట్స్‌రా! తంతే బూర్లె బుట్టలో పడ్డాడన్నట్టు మొత్తంమీద ఏం వెధవ్వేషాలేసినా చివరకి మీ అమ్మానాన్నలకు నచ్చినపిల్లనే చూసుకున్నావు'' అన్నాను, అప్పుడే అక్కడికొచ్చిన రామం భుజంతడుతూ.

''అయితే, ఒక విషయం ఆలోచించండి. ఆ అమ్మాయి మనకు కోడలు కాబోతుంటే ఇప్పుడా ఏభయివేలూ తిరిగిచ్చేదేమిటి? ఆ యాభయివేలూ పెళ్ళి ఖర్చులకుంచేసుకుని అన్ని ఖర్చులూ మనమే పెట్టుకుని పెళ్ళి జరిపించేద్దాం. వెండిబంగారాలు కొనక్కర్లేదు. లంకంత కొంప వుంది. పెళ్ళి మనింట్లోనే జరిపించుకుందాం'' అన్నాడు మా మావయ్య.

"నో ప్రోబ్లమ్. సరస్వతికి నేను నచ్చచెబుతాను" అన్నాడు రామం ధీమాగా.

* * *

పెళ్ళయిన తర్వాత ఏదో పనిమీద ఎయిర్‌పోర్ట్‌కెళ్ళి కాంతిపట్నాయక్‌ను గురించి కనుక్కుంటే అటువంటి పేరున్న ఎయిర్ హోస్టెస్‌ని కనీవినీ ఎరగ మన్నారు. దార్లో బేంక్‌దగ్గిర ఆగి తిన్నగా ఏజెంట్ కళ్యాణరావు దగ్గిరకెళ్ళాను. నేను రావడం చూసినట్టున్నాడు రామం కూడా లోపలికొచ్చేడు. నన్ను చూసి లేచొచ్చి బ్రహ్మానందంతో కరచాలనం చేసి తలుపు మూసి సోఫాలో కూర్చోపెట్టి నా పక్కనే కూర్చున్నాడు.

''కళ్యాణరావుగారూ! మీరు సార్థకనామధేయులు. నూరు అబద్ధాలాడ యినా ఓ పెళ్ళి చేయించమన్నారు కదా అని పోలీసాఫీసర్‌నే బుట్టలో వేసి....'' అంటూ మొదలుపెట్టేను.

''అన్యాయం! నేను అబద్ధం మాడేనా?'' అన్నాడయన.

''ఎయిర్‌హోస్టెస్ గురించి మీకు తెలుసా అని అడిగితే మీరేమన్నారు?''

''తెలుసు. ఆ విషయాలన్నీ తర్వాత చెబుతాను అన్నాను. అది అబద్ధ మెలా అవుతుంది? ఇప్పుడు ఆ వివరాలు చెప్పమంటారా?''

''నాకు తెలియనివి చెప్పండి. నాకు తెలిసిందేమిటంటే ఈ ఎయిర్ హోస్టెస్ ఎఫెయిరంతా కట్టుకథ. రెండోది పీడు పీడిబాబుని మోసంచేసి ఆయన

లక్షరూపాయిల ఫిక్సెడ్ డిపాజిట్టూ పీడికాబోయే అత్తగారి పేర వేశాడు. పెళ్ళి ముందర సరస్వతి డిపాజిట్ కాజేసేదనడం కూడా అబద్ధం. అలా నాటక మాడి...."

"యు అర్ రైట్, బావా! వాళ్ళు పెళ్ళి ఖర్చులు కూడా పెట్టుకునే స్థితిలో లేరు. అంచేత ఆవిధంగా మా నాన్న చేత ఓ యాభై వేలిప్పిద్దామనుకున్నాను" అన్నాడు రామం.

"నీరజా సరస్వతీ స్నేహితులు. అంతేకాదు, నేను చెప్పిన పెళ్ళి సంబంధాల తాలూకు పెద్దమనుషులికి నన్ను గురించి ఆకాశరామన్న వుత్తరాలు రాసి ఆ సంబంధాలు తప్పించడానికి సాయపడింది నీరజే!' అన్నాడు రామం.

"ప్రెస్‌కి ఆ న్యూస్ అయిటమ్ ఎవరిచ్చేరు?"

"నీరజ భర్త రాధాకృష్ణ - ప్రెస్ రిపోర్టర్. అందుకే నేనా విషయంలో స్టేట్‌మెంట్ ఇవ్వడానికి నిరాకరించేనని కూడా రాయమన్నాను" అన్నాడు కళ్యాణరావు. వాళ్ళ పథకాన్నీ విజయాన్నీ ముఖ్యంగా మా రామం విశాల హృదయాన్నీ అభినందించకుండా వుండలేకపోయాను. *

**(పల్లకి వినూత్న వారపత్రిక, 24-2-93)**